క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: బొటానికల్ గార్డెన్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్ సబ్ స్టేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తగూడ విలేజ్, శ్రీరామ్‌నగర్, ఏబ్లాక్, బీ బ్లాక్, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

- శ్రీరామ్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో .. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెసెల్లా విలేజ్, శ్రీరామ్‌నగర్ సీ బ్లాక్, వుడ్స్ విల్లాస్, అపర్ణా హైట్స్, పరిసర ప్రాంతాలు, శ్రీరామ్‌నగర్ ప్రధాన రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 35, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 25, బీర 35, వంకాయ 50, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20–30, అల్లం 150, వెల్లుల్లి 180.

27న నిధి ఆప్ కే నికట్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నికట్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి మదీనాగూడ త్రివేణి స్కూల్‌లో... సంగారెడ్డి జిల్లాకు సంబంధించి జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి... మెదక్ జిల్లాకు సంబంధించి పటాన్‌చెరు మండలం రుద్రారం ఎంఎస్ఎన్ లాబొరేటరీలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

మసీదు నిర్మాణానికి భారీ విరాళం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో మున్సిపల్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మసీద్ ఏ అమీనా అలంగీర్ నిర్మాణానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం మరో రూ.30 లక్షల రూపాయలు అందించారు. భవిష్యత్తులోను మసీదు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటివరకు 175కు పైగా నూతన దేవాలయాలు, వందకు పైగా మసీదులు, చర్చిలు సొంత నిధులతో నిర్మించినట్లు తెలిపారు. అనంతరం వాణినగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మసీదు కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఆరోగ్య పరీక్షలు..

సాక్షి, సిటీబ్యూరో: మాజీ సైనికుల ఆరోగ్యం కోసం...ఆర్థిక సేవలు అందించే, నగరానికి చెందిన సింక్రోనీ కంపెనీ, సైనిక సంక్షేమ శాఖతో కలిసి ప్రత్యేక ఆరోగ్య పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వ సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ పి రమేష్ కుమార్ (రిటైర్డ్) ప్రారంభించారనీ, దీనిలో భాగంగా ఇప్పటి వరకూ 555 మంది మాజీ సైనికోద్యోగులు వారి జీవిత భాగస్వాములకు అవసరమైన ఆరోగ్య పరీక్షలను నిర్వహించామన్నారు. తమ సింక్రోనీ వెటరన్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మిలిటరీ హాస్పిటల్‌కు వైద్య పరికరాలను అందజేయడంతో పాటు సైనిక సంక్షేమానికి ఉద్దేశించిన పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



శేరిలింగంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన లింగంపల్లి–చందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం చోటు చేసుకుంది. నాంపల్లి జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లి–చందానగర్ రైల్వే స్టేషన్‌ల మధ్యన గల ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి (40) నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీ కొట్టింది. దీంతో అతను ఎగిరి దూరంగా పడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుడి చేతికి కడెం వేసుకొని ఉన్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మైహోం జువెల్ నుంచి ఆర్టీసీ కాలనీ వద్ద ఇరుకుగా మారిన రోడ్డు



ఆర్టీసీ కాలనీ ఎదుట రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

రోడ్డు విస్తరణ జరిగేనా..?

ఆర్టీసీ కాలనీ వద్ద ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, కాలనీవాసుల అవస్థలు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరారోడ్డులోని ఆర్టీసీ కాలనీ వద్ద రోడ్డు విస్తరణలో తీవ్ర జాప్యం జరుగుతుంది. మంజీరా రోడ్డును హఫీజ్‌పేట్ రైల్వే బ్రిడ్జి నుంచి లింగంపల్లి బీఆర్ గ్యాస్ వరకు 120 ఫీట్లుగా విస్తరించాల్సి ఉండగా హఫీజ్‌పేట్ రైల్వే బ్రిడ్జి నుంచి మైహోం జువెల్ అపార్ట్‌మెంట్స్ వరకు మాత్రమే రోడ్డు విస్తరణ చేశారు. ఆర్టీసీ కాలనీ నుంచి గంగారం, చందానగర్, లింగంపల్లి వరకు రోడ్డు విస్తరణ చేపట్టలేదు. ఆర్టీసీ కాలనీ నుంచి చందానగర్ వరకు రోడ్డు విస్తరణ అంటూ అధికారులు హడావిడి చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మైహోం జువెల్‌లో వేలాది కుటుంబాలు ఉంటున్నాయి. వారికి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా హఫీజ్‌పేట వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న ఆర్టీసీ కాలనీ రోడ్డు విస్తరణ చేయకపోవడంతో రోజు ఐటీ ఉద్యోగులు ఇటు గచ్చిబౌలి, అటు మాదాపూర్ కంపెనీలకు వెళ్ళే వారి వాహనాలతో ఉదయం, సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ లింక్ రోడ్డు అని చేపడుతుంటే మంజీరా రోడ్డు విస్తరణ మాటేమిటని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మంజీరా రోడ్డులోని హఫీజ్‌పేట్ నుంచి మైహోం జువెల్ వరకు వేసిన డబుల్ రోడ్డు

రోడ్డుపైనే పార్కింగ్, చిరు వ్యాపారాలు..

హఫీజ్‌పేట్ నుంచి మైహోం వరకు డబుల్ రోడ్డు ఉన్నా ఆర్టీసీ కాలనీ వరకు రాగానే రోడ్డు ఇరుకుగా మారుతోంది. ఓపక్క రోడ్డుపైనే వాహనాలు నిలపడం ..మరో పక్క చిరు వ్యాపారులు తినుబండారాల దుకాణాలను రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

ట్రాఫిక్ కష్టాలు



ఇరుకు రోడ్డు వల్ల ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ కష్టాలు తీవ్రం. రోడ్డును ఇరువైపులా విస్తరిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. –కృష్ణ, స్థానికుడు

ఒకవైపు గుంతలు, వాహనాల పార్కింగ్



ఆర్టీసీ కాలనీ వద్ద ఉన్న ఇరుకు రోడ్డులో గుంతలు, మరో వైపు ఉన్న చిన్న రోడ్డుపైనే వాహనాల అక్రమ పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 120 ఫీట్ల రోడ్డు అని అధికారులు చెబుతున్నా 50 ఫీట్ల రోడ్డు కూడా లేదు. ఎప్పుడు రోడ్డు విస్తరణ చేస్తారో తెలియడం లేదు.

– శ్రీనివాస్, స్థానికుడు

సౌకర్యాల కల్పనలో గచ్చిబౌలికి పెద్ద పీట

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి/రాయదుర్గం: మౌలిక సదుపాయాల కల్పనలో గచ్చిబౌలి డివిజన్‌కు పెద్దపీట వేశామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో రూ.22 లక్షలతో, శ్రీకృష్ణకాలనీలో రూ.20 లక్షలతో, నవోదయ కాలనీలో రూ.30 లక్షలతో, రాజీవ్‌నగర్ కాలనీలో రూ.20 లక్షలతో, ఎన్టీఆర్ కాలనీలో రూ.33 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి, పరిసరాల్లో ప్రాంతంలో ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ఉండడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ, లింకురోడ్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతికాలనీ, బస్తీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపడుతున్నామన్నారు. జలమండలి మేనేజర్ అభిషేక్‌రెడ్డి, నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, సత్యనారాయణ, శ్రీనివాస్ యాదవ్, చెన్నంరాజు, సురేందర్, ప్రసాద్, మల్లేష్, రాజుముదిరాజ్, నారాయణ, రమేష్‌గౌడ్, అశోక్, జగదీష్, నర్సింహ్మరాజు, నవాజ్ పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



హఫీజ్‌పేట్: జన సంఘ వ్యవస్థాపకులు స్వర్గీయ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో ఘనంగా జరిగాయి. చేవెళ్ళ మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్‌లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

నెరవేర్చే హామీలనే కాంగ్రెస్ ఇస్తుంది

పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రఘునాథ్‌యాదవ్

రాయదుర్గం: తెలంగాణ ప్రజలకు అమలు చేయగలిగే పథకాలు, హామీలను మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం గోపన్‌పల్లితండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రాములు నాయక్, విఠల్, కృష్ణ, నగేష్, కృష్ణ, చిన్నా, శ్రీనివాస్, సురేష్, దేవదాస్‌నాయక్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనలో భాగస్వాములవ్వాలి

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ



విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గుల్‌మొహర్ పార్కు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబ, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్‌లతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం చంద్రశేఖర్ రావు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీ అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఖాసీం అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ రామస్వామియాదవ్, నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్‌రావు, టీవీ రావు, నిరంజన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, పెంటోజీ, కిషోర్‌బాబు, వెంకటేశ్వర్లు, నాగన్న, ప్రభాకర్‌చారీ, సమీర్, నాయకులు గణేష్ ముదిరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 కోట్లతో గ్రంథాలయ భవనం

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి సర్వే నంబర్ 136లో రూ.3 కోట్లతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీలో జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వెంకటరమణారెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. త్వరలో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేయడంతో పాటు శేరిలింగంపల్లిలో కూడా నిర్మించనున్నట్లు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరీష్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ హరీష్ సోమవారం సందర్శించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్ హరీష్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అలాగే ఆర్డీఓలు మల్లయ్య, అనంతరెడ్డి, సూరజ్‌కుమార్, శ్రీను, వేణు మాధవరావు, సాయిరాం, శేరిలింగంపల్లి మండల తహశీల్దార్ శ్రీనివాసరావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రముఖ ఐటీ సంస్థ నెక్స్ట్ వేవ్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సంస్థలోని ఐటీ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు .ఈ శిబిరాన్ని ప్రారంభించిన నెక్స్ట్ వేవ్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు రాహుల్‌అట్లూరి మాట్లాడుతూ సమాజానికి తిరిగి ఇవ్వడానికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. అనంతరం నిరుపేద పిల్లలకు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

గణేష్ లడ్డూ రూ.5.90 లక్షలు

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీలోని గిరిజ మార్వెల్ అపార్ట్‌మెంట్స్‌లోని గణనాథుడి మండపంలో సోమవారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ఎఫ్ బ్లాక్ వాసులు రూ.5.90 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.



నిర్మాణరంగ అభివృద్ధిలో న్యాక్ కీలకం



మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ భిక్షపతి

మాదాపూర్: శిక్షణతో బాటు ఉపాధి కల్పించడం తమ సంస్థ ప్రత్యేకత అని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి అన్నారు. మాదాపూర్‌లోని న్యాక్‌లో సోమవారం సంస్థ రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ 25 సంవత్సరాలలో 4.75 లక్షల మంది యువతకు నిర్మాణ రంగంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఉపాధి కల్పించినట్టు తెలిపారు. సంస్థ ఏర్పడి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. న్యాక్‌ను తొలి నిర్మాణరంగ విశ్వవిద్యాలయంగా మార్చాలనే ప్రతిపాదనలు ముఖ్యమంత్రి వద్ద ఉన్నాయని, త్వరలోనే యూనివర్శిటీగా అవతరించే అవకాశం అందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐఐ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణరంగం అభివృద్ధిలో న్యాక్ తనవంతు పాత్రపోషిస్తుందన్నారు. ఉత్తమ సేవలందించిన 20 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బీఏఐ జాతీయ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఈపీటీఆర్ఐ-ఇక్ఫాయ్ ఒప్పందం



ఒప్పందం చేసుకున్న ఈపీటీఆర్ఐ డీజీ వాణిప్రసాద్, ఇక్ఫాయ్ వీసీ ప్రొ.గణేష్, ఇరు సంస్థల అధికారులు

రాయదుర్గం: పరిశోధన రంగాలలో మరింతగా పరస్పరం సహకరించుకొని సంయుక్తంగా పనిచేయాలని గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ (పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ),ఇక్ఫాయ్ యూనివర్శిటీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ది ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కౌన్సిల్)తో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంపై సోమవారం ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్, ఇక్ఫాయ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ ఎస్ గణేష్ సంతకాలు చేశారు.ఈ సందర్భంగా వాణిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ మార్పు, నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ ప్రభావ అంచనా, సహజ వనరుల స్థిరమైన ఉపయోగం కోసం వ్యర్థాల నిర్వహణ మొదలైన రంగాలలో కలసి పని చేయాలని నిర్ణయించామన్నారు. ఇక్ఫాయ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేష్ మాట్లాడుతూ పర్యావరణ చట్టం, న్యాయంలో ఈపీటీఆర్ఐ ఐసీఎఫ్ఏఐ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ మేనేజర్ డాక్టర్ భీమ్‌రెడ్డి, ఇక్ఫాయ్ అధికారులు లోకేశ్వరి, చంద్రకళ, ఈపీటీఆర్ఐ డబ్ల్యూ ఆర్‌సీ మెడ్ మధుచంద్రిక చటోపాధ్యాయ, ఎయిర్ ఎక్స్‌పర్ట్ రైసుద్దీన్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ షో.. అదుర్స్



మాదాపూర్: మగువలు క్యాట్‌వాక్‌తో అబ్బురపరిచారు. మాదాపూర్‌లోని నోవాటెల్‌లో సోమవారం వివాహిత మహిళల కోసం ఏర్పాటు చేసిన మిసెస్ ఇండియా తెలంగాణ 2023 గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని నిర్వహించారు. మమతా త్రివేది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాషన్ షోలో మూడు కేటగిరిలలో 70 మంది పోటీపడ్డారు. మిసెస్ ఇండియా తెలంగాణ– 2023గా రేణుశర్మ నిలిచింది. క్లాసిక్ కేటగిరిలో డాక్టర్ స్రవంతి గదిరాజు, సూపర్ క్లాసిక్ కేటగిరిలో డాక్టర్ విజయశారదరెడ్డి గెలుపొందారు. నేత కార్మికులకు మద్దతు ఇవ్వడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మమతా త్రివేది తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ కనెక్ట్ 2023 చేనేత హస్తకళామేళా సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా దొడ్డబాలాజీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో మూషిక వాహన, లింగాష్టకం, త్యాగరాజ కీర్తన, గణేశ వందనం, గణేశ పంచరత్న, దశావతార శబ్దం, మహిషాసురమర్ధిని, బృందావన తిల్లాన, అన్నమయ్య పదనర్తన, జతి స్వరం, తదితర అంశాలను కళాకారులు అనన్య, శాన్వి, చరిస్మా, నిత్య, సుజనశ్రీ, మాన్విత, వేదం రెడ్డి, లౌక్యస హంసిని, వందనలక్ష్మి, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

వినాయక ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిల్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్ఠించిన గణనాథులకు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదానాలు చేస్తున్నారు. మరోవైపు గణేష్ నిమజ్జనాలు కూడా సాగుతున్నాయి.– శేరిలింగంపల్లిజోన్ బృందం



శేరిలింగంపల్లిలో గణేషుడి పూజలో ఎమ్మెల్యే గాంధీ, బీఆర్ఎస్ నాయకులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు



రాయదుర్గంలో..మాజీ కార్పొరేటర్ సాయిబాబా, ఉత్సవ కమిటీ ప్రతినిధులు



శేరిలింగంపల్లిలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు



చందానగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి



తారానగర్‌లో.. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఉత్సవ సమితి ప్రతినిధులు



గచ్చిబౌలి డివిజన్‌లో.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఉత్సవ సమితి నాయకులు